WATA NIKETANA
NO.——
VETAPALEM

మొగలిరేకు

యామిని

(గత సంచిక తరువాయి)

"అది ఇప్పుడు ఆలోచించలేవు!.... అయినా మన వాదనల వలన ప్రయోజనం ఏమిటి?"

రామమోహనరావులో బలవంతంగా కూడగట్టుకున్న శక్తి హఠాత్తుగా మాయమైనట్లుంది.

"నువ్వు ఇచ్చినమాట తప్పడంవలన నా కూతురు బ్రతుకు..." కంఠం వణుకుతూంది.

"బహుశా నేను బలహీనుణ్ణేమో!... కాని ఈ పెళ్లిమాత్రం జరగదు...." కేశవరావు తల తిప్పుకున్నాడు.

కీలు విరిగిన బొమ్మలా కూలబడిన మొగుణ్ణి చూడగానే కళ్ళు తుడుచుకుంది లక్ష్మీదేవి. దుఃఖం ఆగిపోయింది. అడగకుండానే విషయం తెలిసిపోయింది. కాలం ఇలా గడువకుండా ఆగిపోవడానికి వీలులేదు. ఏదో జరగాలి! ఈ పరిస్థితి మారాలి! ఏదో ఎవరో చెయ్యాలి!

వెంటనే ఆవిడ మనసులో మెరుపు లాంటి ఆలోచనవచ్చింది. తమ్ముడి కోసం వెదికింది. నెత్తిమీద నిలచిన అపకీర్తి తొలగిపోయినట్లే తోచింది.

"తమ్ముడూ! నువ్వన్నట్లు చివరకు నీకే రాసిపెట్టి ఉందేమోరా! మా పరువు నువ్వే కాపాడాలిరా! రుక్మిణిని పెళ్లి చేసుకోరా," అంది.

"ఇంత ధనవంతులు, ఇంతటి స్నేహితులు నిలబెట్టలేని మీ యింటి పరువును దిక్కులేనివాణ్ణి నేనెలా నిలబెట్టగలనక్కయ్యా! నా సాధ్యం కాదు," అన్నాడు నరసింహం.

"చచ్చిన పామును చంపకురా! ఈ ఒక్క సాయం చెయ్యరా." తమ్ముడి చేతులు పట్టుకుంది లక్ష్మీదేవి.

"నన్ను క్షమించు అక్కయ్యా!" నరసింహం అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

లక్ష్మీదేవి నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. ప్రపంచాన్ని గురించి ఇన్నాళ్లూ అర్థంకాని విషయమేదో అర్థం అవుతూన్నట్లనిపించింది ఆవిడకి.

తిరిగి మొగుడున్న గదిలోకి వెళ్ళింది. రామమోహనరావు అలాగే కూర్చు న్నాడు.

సరిగా అదే సమయంలో బయటనుంచి ఇంట్లోకి వస్తూన్న ఫిడేలు మాస్టారు కృష్ణమూర్తి కనబడ్డాడు.

మహాప్రవాహంలో తల మున్కలుగా కొట్టుకొనిపోయే మనిషి సీటిలో తేలే వస్తువు వైపు ఈదుకెళ్ళినట్లు అతనివైపు పరుగెత్తికెళ్ళింది.

శుభ సందర్భానికి ధరించిన ఆవిడ వస్త్రాలూ, నగలూ, చెదిరిన బొట్టూ, కనీళ్ళూ కాటుకతో అలుక్కొని పోయిన ఆవిడ ముఖం చాలా విపరీతంగా తోచింది కృష్ణమూర్తికి. అన్నాళ్ళూ అమాయకుడుగా వెర్రివాడుగా కనబడ్డ కృష్ణమూర్తి ఆ క్షణంలో ఆవిడ కళ్ళకి ఈ రాక్షస ప్రపంచంలో మిగిలి ఉన్న ఒకే ఒక మనిషిగా కనబడ్డాడు.

"మేష్టారూ! మమ్మల్నీ కష్టంనుంచి మీరే గట్టెక్కించాలి. ఇవి చేతులుకావు. కాళ్ళు! కాదనకండి!"

అతనికేమీ అర్థంకాలేదు. కాని ఆవిడ పరిస్థితి చూస్తే మాత్రం గుండెలు తరుక్కుపోయేటట్లుంది. ఒక వేళ తన ప్రాణాలిమ్మంటే మాత్రం ఎలా కాదనగలడు!"

"చెప్పండి! నేనేంచెయ్యగలను!"

"మా అమ్మాయి రుక్మిణిని పెళ్లి చేసుకోవాలి."

కృష్ణమూర్తి ఆలోచన నిలచి పోయింది. ఆ సందర్భానికి అయిన వాళ్ళందరూ అప్పటిదాకా పంచుకున్న 'షాక్' అతని మెదడులోకి ప్రవేశించింది. అతను ఏం విన్నాడో ఏం జవాబు చెప్పాలో తెలీలేదు. ఆలోచించు కోనిస్తే నే ఎక్కడ కాదంటాడోనని భయం పుట్టింది లక్ష్మీదేవికి.

"ఉదయం ఆరుగంటలకు ముహూర్తం. ఈ ముహూర్తానికే పెళ్లి జరిగి పోవాలి! అవుననండి. మీ సహాయానికి జన్మంతా ఋణపడిఉంటాం."

"నన్నాలోచించు కోనివ్వండి." తను మాట్లాడగలిగిన ఒక్కవాక్యం మాట్లాడేదు కృష్ణమూర్తి.

మళ్ళీ లక్ష్మీదేవి మొగుడిదగ్గర కెళ్ళింది.

"ఫిడేలు మాస్టారు కృష్ణమూర్తిగారు రుక్మిణిని పెళ్లిచేసుకుంటానన్నారు. ఈ ముహూర్తానికే పెళ్లి చేసేద్దాం," అంది లక్ష్మీదేవి.

మొదటిసారిగా చలనం వచ్చింది రామమోహనరావులో.

4

తలుపుతీసిన మాణిక్యం అర్ధరాత్రి పూట కృష్ణమూర్తిని చూసి ఆశ్చర్య పోయింది.

"రాధతో మాట్లాడాలి." అన్నాడతను నిర్వికారంగా.

ఆమె ఆశ్చర్యంలోనుంచి కోలు

కాసే లోపలే అతను లోపలికి వెళ్ళిపోయేడు. మాణిక్యం వెనకాలే వెళ్ళింది.

జరిగిందంతా చెప్పేడు కృష్ణమూర్తి.

"ఏం ఆలోచించుకున్నారు?" రాధ అడిగింది.

"నాకు తెలియటంలేదు."

"మీకు రుక్మిణి అంటే ఇష్టమా?"

"నేనెప్పుడూ ఆ దృష్టితో ఆలోచించలేదు. కాని నా విషయం ముఖ్యం కాదు. ఆమెకు ఈ ముహూర్తానికి పెళ్లి కాకపోతే ఇన్నాళ్ళూ ఓ అంతస్తుకూ హోదాకూ అలవాటుపడినవాళ్ళు ఏమయిపోతారో...."

"అయితే చేసుకోండి."

"నీకు కష్టంగా ఉందా?"

"నాకు మీరెవరితో ఉన్నా కష్టంగానే ఉంటుంది. కాని ఈ కులంలో ఈ జన్మ ఎత్తినందుకు ఇన్నాళ్ళు ఈ బతుకు బ్రతికినందుకు మిమ్మల్ని నేను చేసుకోలేను...."

"కాని నిన్ను మరచిపోవడం నాకెంత కష్టమో నాకు తెలీదు."

"తెలుసు. కాని ఒక్కమాట గుర్తుంచుకోండి. ఒకరి రక్షణ కోసం మీరిది చేస్తున్నప్పుడు మీ సుఖం ప్రసక్తే లేదు. వాళ్ళ పరువూ మర్యాదా నిలబెట్టడం కోసమేకదా మీ రీ పని చేస్తూన్నది! దాన్ని నిలబెట్టడం కోసమే మీరు మళ్ళీ ఈ గుమ్మం తొక్కకూడదు...."

"రాధా!"

"నేను కోపంతో అంటున్నానని అనుకోవద్దు. నాకు ఎప్పుడూ మీ చేతుల్లో వాలిపోవడం ఇష్టమే. కాని మీరు ఇందులో ఓడిపోవడం నాకిష్టంలేదు.... ఇంకో విషయం మీ బిడ్డని నేను కడుపులో దాచుకున్నాను. బిడ్డను కని ఇద్దరం సవ్యంగా ఉంటే ఏడాదికోసారి ప్రతీ పుట్టినరోజుకూ ఒక్కసారి మిమ్మల్ని చూసుకోనివ్వండి. ఒకవేళ నేను మిగలకపోతే బిడ్డనిమాత్రం మీరు ఎలాగో తీసుకొని వీటన్నింటికీ దూరంగా ఉంచండి! అంతే! మీరు వెళ్ళిరండి."

"రాధా!" కృష్ణమూర్తి గాఢంగా కౌగిలించుకున్నాడు. రాధ చెక్కిళ్ళమీద నుండి కన్నీళ్ళు దారం తెగిన పూసల్లా జారిపోయేయి.

కృష్ణమూర్తి వెళ్ళగానే మాణిక్యం రాధ మీదకి పెద్దపులిలా లేచింది. తన కళ్ళల్లో కారం చల్లిందంది. వెంటనే కడుపు దింపించుకోమంది.

రాధ ఎదురు తిరిగింది. ఇప్పుడామె కృష్ణమూర్తి విషయంలో తల్లికి భయపడనవసరంలేదు. ఎలాగూ అతని పొందుతానే దూరం చేసుకుంది. అందుకనే స్పష్టంగా మనసులో మాట చెప్పేసింది.

"ఇన్నాళ్ళూ నీ మాట తు చ తప్పకుండా విన్నాను. ఇకముందు కూడా నీ వ్యాపారం అడ్డులేకుండా సాగాలంటే నా మాటకూడా నువ్వు వినవలసి ఉంటుంది: నేనీ బిడ్డని కని తీరాలి. ఒకవేళ నా

కడుపులో పిండానికి నువ్వు కీడు తలపెడితే నా ప్రాణం నేనే తీసుకుంటాను. నాకు నా బిడ్డ కరువయిన రోజే నీకునీ బిడ్డ కూడా కరువైపోతుంది. అదీ కాక, ఆయన ఎప్పుడిక్కడికి వచ్చినా ఏమాత్రం అమర్యాద జరిగినా ఆ రోజుతో నీకూ నాకూ సరి!"

దాంతో మాణిక్యం నోటికి తాళం పడింది.

5

కాలచక్రంలో అయిదేళ్ళు తిరిగిపోయేయి.

రుక్మిణి పెళ్ళయిన రోజునుంచీ నరసింహం ఇంట్లోంచి మాయమయ్యేడు. ఎక్కడికి వెళ్ళేడు ఎందుకు వెళ్ళేడు అన్న విషయం ఎవరూ పట్టించుకోలేదు.

రామమోహనరావు సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసేడు. ఈ లోపులో ఆయన లాయరు హైకోర్టు ఇచ్చిన తీర్పును క్షుణ్ణంగా పరిశీలించి ఏడాది కొంత నియమితమైన డబ్బును ఖర్చుచేసుకుంటూ మిగిలిన ఆదాయం అంతా కోర్టులో డిపాజిట్ చేయవలసి ఉంటుందన్న విషయం చెప్పేడు.

ఏదో కోటలాంటి ఆ యింట్లో గుట్టు బయట పడకుండా కాలక్షేపం అయిపోతూంది.

రుక్మిణికి ఓ మగపిల్లవాడూ ఆడపిల్లాను. పిల్లవాడికి మూడేళ్ళు, పిల్లకి ఇంకా ఏడాది నిండలేదు.

రాధ పనసపండులాంటి కొడుకును కంది. పంచప్రాణాలూ వాడిమీద పెట్టుకొని పెంచుకుంటూంది.

మాణిక్యం నాలుగునెలలు మంచం పట్టి కన్నుమూసింది. కన్నతల్లి కనుక ఆ రోజు కన్నీరు కార్చినా రాధకు ఓ పెద్ద బరువు మనసులోంచి దింపినట్లయింది. మకాం మార్చలేకపోయినా మనసు పూర్తిగా మారిపోయింది. వృత్తిలోనుంచి తప్పుకుంది.

రాధతో ఒప్పుకున్న ప్రకారంగా కృష్ణమూర్తి రాధ కొడుకు ప్రసాదు పుట్టినరోజుకు తప్పక ఆమె యింటికి వెడతాడు. ఆమెతో మనసువిప్పి ముచ్చటించి ఓ గంట ఫిడేలు వాయించి వచ్చేస్తాడు.

ఇంటివగ్గర ఏదో చీకటిలో చేసిన తప్పుకు పిల్లలు పుట్టడమే కాని కృష్ణమూర్తి, రుక్మిణీ ఇద్దరు పరిచయస్తుల కంటే సన్నిహితంగా రాలేకపోయేరు. కృష్ణమూర్తికి అందుకనే ఏమాత్రం భావావేశం కలిగినా కళ్ళు మూసుకొని రాధను మనసులో ప్రతిష్ఠించుకొని ఫిడేలు తనచేతిలోకి తీసుకొని తన ప్రపంచంలోకి వెళ్ళిపోతాడు.

ఆ రోజు ప్రసాదుకు అయిదేళ్ళు నిండేయి. ఆ రోజుకోసం ఎదురుచూస్తూ కృష్ణమూర్తి వారం రోజులుగా సరిగా నిద్రపోలేదు. పిచ్చెక్కిన వాడిలా ఎప్పుడూ ఫిడేలు వాయిస్తూ కూర్చుం

టూంటే ఒకటిరెండుసార్లు రామమోహనరావు కొంచెం వినుక్కున్నాడు కూడాను.

మధ్యాహ్నం మూడు గంటలకు పల్లపు వీధిలోకి వెడుతూన్న కృష్ణమూర్తిని చూసి ఆశ్చర్యపోయాడు రామమోహనరావు. వెంటనే తన కూడా ఉన్న పాలేరు సింహాద్రికి కనుసైగ చేసేడు. సింహాద్రి కనబడకుండా కృష్ణమూర్తిని వెంబడించి రాధ యింట్లో అద్దెకుంటున్న బంగారి ఇంట్లో దూరేడు. కృష్ణమూర్తి వెళ్ళగానే రాధ పాదాలపై పడిపోయి కన్నీళ్ళతో అభిషేకంచేసింది. మనసులో ఉన్న విరహమంతా మాటల్లోకి అనువదించి చెప్పింది. ఆప్యాయంగా తాను చేసిన పిండి తినిపించింది.

"నాన్నకు దండంపెట్టు!" అని పసివాణ్ణి తీసుకొచ్చి పాదాలమీద పారేసింది.

కృష్ణమూర్తి హృదయం అనురాగంతో కరగిపోయింది.

రాధ ఫిడేలు తీసుకొచ్చి చేతికిచ్చింది.

"నను పాలింపగ నడచివచ్చితివా..." త్యాగరాయ కృతి వాయించమంది. రెప్పలార్పక తనవైపే ఆరాధనతో చూస్తూన్న రాధ కళ్ళతో కళ్ళు కలిపి కృష్ణమూర్తి ఫిడేలు తీగెల మీదకు కమాను ఆన్చేడు.

భూమిలోంచి జలగా పుట్టి నిండిన ఘ్నులాగా గదంతా సంగీతంతో యింది. రాధ సర్వం మరచి మోహనరాగంలోని మాధుర్యంలో పరవశించిపోయింది.

"....వనజనయన నీదు మోము చూచుటే...." హెచ్చుస్థాయిలో రిషభం, గాంధారం చుట్టూ తిరిగి దానితో ఐక్యమైపోయిన భ్రమ కలిగిస్తూంటే దేహాలు వేరయినా మనసులు ఏకమైపోయి భావావేశంతో ఆనందబాష్పాలు రాధ చెక్కిలిమీదనుంచి దొర్లిపోయాయి.

ఏడాదికి ఇటువంటిరోజు ఒక్కటే చాలు ననిపించింది కృష్ణమూర్తికి. ఇంటికి వెళ్ళేసరికి చీకటి పడిపోయింది.

వీధి వసారాలో రామమోహనరావు ఆకలిగొన్న పులిలా తిరుగుతున్నాడు.

కృష్ణమూర్తి వసారాలోంచి తన గదిలోకి వెళ్ళబోతున్నాడు.

"కృష్ణమూర్తీ!" ఉరిమినట్లు పిలిచిన మామగారి పిలుపువిని ఉలిక్కిపడి అటు తిరిగి "పిలిచేరా?" అన్నాడు కృష్ణమూర్తి.

"అవును. ఇప్పుడు నువ్వెక్కడినుంచి వస్తున్నావు?" పగలబోయే అగ్నిగోళంలా ఉన్న మామగారిని చూసి తడబడ్డాడు కృష్ణమూర్తి. మాట రాలేదు. నేలచూపులు చూసేడు.

"పల్లపు వీధినుండా?" రామమోహనరావు అడిగేడు.

"అవును."

లోపలనుంచి లక్ష్మీదేవి, రుక్మిణి వచ్చి నిలబడ్డారు.

"రాధ యింటిదగ్గర్నుంచా?"

"అవును."

"దాని కోసం ఫిడేలు వాయించి వస్తున్నావా?"

"అవును."

"దాని కొడుకు నిన్ను 'నాన్నా!' అని పిలిచేడా?"

"పిలిచేడు."

"వాడు నీ కొడుకేనా?"

"అవును."

తక్షణం ఈ యింట్లోనుంచి వెళ్ళిపో! నువ్వొకప్పుడు ఈ యింటికి సంబంధించిన వ్యక్తివన్న మాట మరచిపో!" అన్నాడు రామమోహనరావు. అతని గొంతు చీలిపోతున్నట్లనిపించింది.

"ఏమండీ!" అంటూ భర్త దగ్గరకు రాబోతూన్న రుక్మిణిని "రుక్మిణీ! లోపలకు పో!" అని బాధగా గుండె చేత్తో పట్టుకొని అరుస్తూన్న తండ్రిని చూసి భయపడి ముందడుగు వేయలేకపోయింది.

లక్ష్మీదేవి భర్తను పట్టుకుంది.

కృష్ణమూర్తి కట్టుబట్టలతో బయటకు వెళ్ళిపోయాడు.

అరగంట క్రితమే తన యింటిలోంచి వెళ్ళిన కృష్ణమూర్తిని మళ్ళీ వాకిట్లో చూసి ఆశ్చర్యపోయింది రాధ.

"ఏమిటండీ ఇది?" అంది.

"వచ్చేసేను రాధా! ఎప్పటికీ నీతో ఉండాలని వచ్చేసేను."

"ఎంతపని చేసేరండీ!"

"నేనేం చెయ్యలేదు. అంతా వాళ్ళే చేసేరు. నేను ఒకప్పుడు వాళ్ళమనిషినన్న మాటే మరచిపొమ్మన్నారు...."

"ఎందుకు?"

"నన్నింకేమీ అడగొద్దు."

"రండి. లోపలకు రండి."

ఆ రాత్రి రాధ మనసు ఒకవైపు ఆందోళనతోనూ మరోవైపు ఆనందంతోనూ ఊగిసలాడింది.

చివరకు జరిగింది విన్నతరువాత తమ తప్పేమీ లేకపోయినా ఇలా జరగడం దైవసంకల్పమేనని సరిపెట్టుకుంది.

కృష్ణమూర్తి అసావేరి రాగంలో "రారా మా యింటి దాక...." భైరవిలో "....ఉపచారము చేసేవారున్నారని మరువకురా...." వాయిస్తూంటే తన మనసులో భావాన్నే చెప్తూన్నట్లు తన్మయత్వం చెందింది.

మనసులకు అన్నిరకాలైన సంకెళ్ళూ తెగిపోగానే ఆ రాత్రి రాధా, కృష్ణమూర్తీ సుఖసాగరంలో మునిగితేలేరు.

6

భార్యా వియోగంతో పూర్తిగా మనసు చెదిరిపోయి మరేదో చివరి దెబ్బ కోసం ఎదురు చూస్తూన్నట్లు రోజులు నెట్టుకొస్తున్నాడు రామమోహనరావు. చివరకు అదీ రానేవచ్చింది. సుప్రీంకోర్టుకూడా తనకు వ్యతిరేకంగా తీర్పు

చెప్పిందని తెలిసిన తర్వాత వివరాలు తెలుసుకోకుండానే అతను కన్ను మూసేడు.

ఇంతటి విపరీత పరిస్థితుల్లో కృష్ణమూర్తి ముందుకొచ్చి అన్నీ కలుగజేసుకొని చివరికి ఆ కోటలోంచి భార్యా పిల్లలతోనూ వద్దంటూంటే కూడా వచ్చిన పనిమనిషి సీతాలుతోనూ ఓ పెట్టెడు బట్టలతోనూ బయటికొచ్చి ఊరి చివర చిన్న ఇంట్లో తల దాచుకున్నాడు.

మనసు తెరిచి అయ్యేటట్లు పూర్తిగా ఏడవడానికి కూడా సమయం దొరకని రుక్మిణి ఆ రాత్రి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. ఓదార్చబోయిన కృష్ణమూర్తిని పట్టలేని ఉక్రోషంతో అనరాని మాటలంది. తన బ్రతుకంతా అతడే నాశనం చేసేడంది. పిల్లలకింత విషంపెట్టి తాను తిన్నా వదిలిపోయేదంది. తనకు ఒక్క నిముషం బ్రతికుండడమే ఇష్టంలేదంది. తానింక కొన్నిరోజులు బ్రతికుండాలంటే తనవేపు చూడనే వద్దంది. కృష్ణమూర్తి పూర్తిగా దెబ్బతిన్నాడు. బాధ్యత వదుల్చుకొని రాధ దగ్గిరకు పోలేకా సహకరించని భార్య బాధ్యత తీసుకోలేకా మథనపడ్డాడు. చేయని నేరాలకు నిందలు భరించలేకపోయాడు.

తెల్లవారేసరికి నిర్జీవంగా ఉన్న కృష్ణమూర్తి శరీరాన్ని చూసి రుక్మిణి చేష్టలు దక్కి నిలబడిపోయింది. ఇది తెలిసిన రాధ అందరిలోనూ అతన్ని అవమానపరచినట్లు అవుతుందని రాలేక ఒక్క సారయినా చూడకుండా ఉండలేకా గట్టుమీద పడిన చేపలా గిలగిలలాడింది. వలవలా ఏడ్చింది. ఆస్తి ఉన్నన్నాళ్ళు చెరువులో కప్పల్లా చేరిన బంధువులు ఒక్కరుకూడా ముఖం చూపించకపోయేసరికి బంధుకోటి మీద అసహ్యం పుట్టింది. కళ్ళు మూసుకొని నిద్రపోతూన్నట్లున్న భర్త ముఖాన్ని చూస్తూంటే తానే ఏదో తప్పుచేసినట్లు అనిపించింది. అసలు భర్త ముఖాన్ని అంత పరిశీలనగా ఒక్కసారయినా బ్రతికుండగా చూసేనా అనిపించింది. అతని శవంమీదపడి ఘోరున ఏడవడం మొదలు పెట్టింది. కాని ఆ శవం కదిలే మార్గం కనబడలేదు.

చివరకు మింగలేని దుఃఖాన్ని దిగమింగుకొని రాధే ఊళ్ళో ఒకరిద్దరి దగ్గరకు వెళ్ళి బ్రతిమాలి కృష్ణమూర్తి అంత్యక్రియలకు ఏర్పాటు చేసింది. అప్పుడే అలుముకుంటూన్న చీకట్లలో చితిమంటల వెలుగులో పసివాడిని అక్కున చేర్చుకొని దిక్కులేనిదానిలా విలపించింది రాధ.

పదిహేను రోజులు గడిచేయి. అన్నీ అయిపోయేయి. ఏది ఎలా జరిగిందో రుక్మిణికి తెలియదు. ఎవరో వచ్చేరు. ఏదో చేసేరు. అంతే!

ఆ రోజు పెరటి గుమ్మంలో కూర్చుని పిల్లని ఒళ్ళో వేసుకుని పాలి

స్తూంది ఎందుకో భర్త పదేపదే దీనంగా గుర్తుకొస్తున్నాడు. అతని మనసేమిటో అసలు తనకు అర్థం కానేలేదు. విలువ తెలియకనే విలువైన వస్తువేదో చేజే తులా పోగొట్టుకున్నట్లుంది.

అడుగుల చప్పుడయితే తలతిప్పి చూసింది. మసకచీకట్లో మనిషి గుర్తు తెలీలేదు. అందంగా ఎత్తుగా ఉందామె. ముఖం మాత్రం దిగులుతో చిన్నబోయి ఉంది.

ముందుకువంగి ఆమె రుక్మిణి కాళ్ళ దగ్గర కొంతడబ్బు పెట్టింది. రుక్మిణికి కొరడాతో కొట్టినట్లు అయింది.

"రాధ నువ్వేనా?" అని అడిగింది.

"అవును." అంది రాధ తలవంచు కొనే.

"ఏం తల్లీ! నేను ఇలా కూడా ప్రాణంతో ఉండడం ఇష్టలేదా నీకు!.." రుక్మిణి మాటలు ఇంక వినలేక పొంగి వస్తూన్న దుఃఖాన్ని దాచుకుంటూ గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది రాధ.

ఆ డబ్బు చూస్తే తేళ్ళూ జెర్రులూ వొళ్ళంతా పాకినట్లనిపించింది రుక్మిణికి. సీతాలుకిచ్చి పంపించెయ్యాలని అనుకుంటూ చీకటిపడినా చాలాసేపు అలాగే కూర్చొని కూర్చొని ఇంట్లోకి వెళ్ళింది రుక్మిణి.

ఇంట్లో ఉన్న అఖరు సోలెడూ వండి ఆ రోజు పిల్లలకు పెట్టి తాను తినకుండానే పడుకుంది.



తెల్లవారగానే సీతాలు వెళ్ళి సరుకులు తీసుకువచ్చింది. మధ్యాహ్నం భోజనంచేసి లేవబోతూ గూట్లోపెట్టిన డబ్బు తీసుకెళ్ళి రాధ కిచ్చేసి రమ్మని రోషంగా సీతాలుతో చెప్పింది రుక్మిణి.

ఆ డబ్బుతోనే సరుకులు తీసుకొచ్చే నని సీతాలు చెప్పగానే తెల్లబోయింది.

నెలరోజులు గడిచేయి.

మరో రోజు సాయంత్రం పెరట్లో ఎవరో తారట్లాడుతూన్నట్లు అనిపించ గానే అటు వెళ్ళిన రుక్మిణికి మళ్ళీ రాధ కనబడింది. రుక్మిణిని చూడగానే డబ్బు పెరటి అరుగుమీద పెట్టేసి తొందరగా వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది రాధ.

అక్కడే గంటల తరబడి అర్థంలేని ఆలోచనలతో కూర్చుని చివరకు డబ్బు తీసుకొని లోపలకు వెళ్ళింది.

ఆరు నెలలు అలాగే గడిచి పోయేయి.

ఓ రోజు రాధ డబ్బిచ్చి వెడుతూంటే ఆగమంది రుక్మిణి. రాధ ఆగింది.

"కూర్చో!" అంది రుక్మిణి.

రాధ దూరంగా కూర్చుంది. రుక్మిణి రాధను తేరిపార చూసింది. ఆమె అందా నికి ఆశ్చర్యపోయింది. రాధ తల వంచు కొనే ఉంది.

"ఎందుకు మాకిలా సాయంచేస్తు న్నావు?" అంది రుక్మిణి.

"మీరు ఇబ్బందిలో ఉన్నారని."

"ఈ డబ్బు నేను తిరిగి ఎప్పటికీ ఇయ్యలేకపోవచ్చు."

"ఇయ్యనక్కరలేదు."

"నీకెందుకు ఇంత అభిమానం!"

"ఇది ఆయన సంసారమని."

"ఆయన సంసారానికి నీ వలన ఎంత కీడు జరిగిందో తెలుసా?"

"మీ కన్నీ తెలియవమ్మా! మీ పెళ్ళికి ముందే ఆయన నా వాడు. పీటలమీద పెళ్ళి ఆగిపోయినప్పుడు మీ అమ్మ గారు ఆయనను ప్రతిమాలగా ఆ రాత్రి నా అనుమతి తీసుకొని మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నారు. అప్పటికే ఆయన బిడ్డ నా కడుపులో ఉన్నాడు. తర్వాత మీ పరువు నిలబెట్టాలనే ఉద్దే శంతోనే ఆయనను విడచి ఉండలేని నేను నా గడప తొక్కొద్దన్నాను. కాని ఏడాదికోసారి మాత్రం నా ముందు కూర్చొనివెళ్ళమన్నాను.అంతేనమ్మా...." రాధ కళ్ళల్లో నీళ్ళు చూడగానే రుక్మిణి హృదయం ద్రవించిపోయింది.

అందరి కళ్ళూ తమమీదే ఉన్నాయని ఆరునెలల తర్వాత రాధా రుక్మిణీ ఆ వూరు విడచి పిల్లలతో వెళ్ళిపోయేరు.

రెండవ భాగం

1

విందు ముగిసింది. విందు అయ్యే లోపల మాలిని నాలుగైదుసార్లు రాజా రావుగారి దగ్గరకొచ్చి వడ్డించి కొసరి కొసరివేసి ఎంతో మర్యాద చూపించింది.

ఆ తర్వాత లాన్స్‌లో కుర్చీలు వేసుకొని కూర్చొని మాట్లాడుతూండగా

మెల్లగా నరసింహం అసలు విషయం బయటపెట్టేడు.

"మా అమ్మాయి మాలినికీ మీ అబ్బాయి ఆనంద్‌కీ ఈడూ జోడూ కుదిరి చూడ ముచ్చటగా ఉంటారను కుంటున్నాను మీరు మాలినిని చూసే ఉంటారు!...."

"అమ్మాయికేం! బంగారుబొమ్మ."

"మరయితే...."

"చేసుకొనేది అబ్బాయిగా! వాడినో సారి అడిగి చూద్దాం! వాడు సరేనంటే నా అభ్యంతరం ఏమీలేదు," అన్నాడు రాజారావు.

నరసింహం మనసు తేలికపడింది.

"అయితే అబ్బాయినోసారి తీసు కొస్తే బాగుంటుంది," అన్నాడు.

"చూద్దాంలెండి! నేను వాడితో మాట్లాడి మీకు చెప్తాను." అంటూ రాజారావు లేచేడు.

మాలిని మళ్ళీ వచ్చి ఎంతో వినయంగా నమస్కరించింది. రాజారావు ఈసారి ఆమెను పరిశీలనగా చూసి

మార్చి నెల యువ

భావపరిచయ పోటీ

బహుమానం రూ. **25-00**

ఈ కార్టూనుకు హాస్యయుత వ్యాఖ్య (Caption) కావాలి



గమనిక : వ్యాఖ్యలు పోస్టుకార్డు మీదనే వ్రాయాలి.
జనవరి 20 వ తేదీ లోపు మాకు చేరాలి.

తృప్తిగా అర్థయుక్తంగా నవ్వేడు నరసింహం వైపు చూసి.

నరసింహం క్రొండెక్కేసేడు.

ఆనాడు దిక్కులేనివాడుగా బావగారింట్లో చేరి అప్రయోజకుడుగా బ్రతికిన నరసింహం ఏదో చేతనైన వ్యాపారం చేతపట్టి తానూ బావగారి అంతంత ఆస్తి సంపాదించేడు. శ్రీమంతుడు రాజారావుతో వియ్యమందితే దానికో గుర్తింపు కలుగుతుంది.

రాజారావు కొడుకు ఆనంద్ బ్యాంకులో ఆఫీసరు.

ఆ రాత్రి భోజనాల దగ్గర రాజారావు కొడుకుదగ్గర పెళ్లి మాట తీసుకొచ్చేడు. ఇప్పుడేం తొందర అని ముందు దాటెయ్యబోయిన ఆనంద్ సంబంధం వివరాలు విని మనసులో మాట చెప్పెయ్యడం మంచిదని ఆలోచించి చెప్పేసేడు. తను పని చేస్తూన్న బ్యాంకు ఎదురుగా ఉన్న ఆఫీసులో పనిచేస్తూన్న సుశీల అనే అమ్మాయిని తాను వరించినట్లు చెప్పి ఆ సంబంధంకోసం ప్రయత్నం చెయ్యమని సూచించేడు.

మర్నాడే వివరాలు తెలుసుకొని రాజారావు వెతుక్కుంటూ రుక్మిణి ఇంటికి వచ్చేడు. సుశీలను చూడగానే పేరుకు తగిన పిల్ల అనిపించింది. వెంటనే సంబంధం ఖాయం చేసుకొని తాంబూలాలు పుచ్చుకున్నారు.

రుక్మిణి సంతోషానికీ, రాధ సంతోషానికి అంతులేదు. మగపిల్లలిద్దరూ ఏదో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వాళ్ళ దారి వేరు. సుశీల ప్రస్తుతానికి ఉద్యోగం చేస్తూన్నా ఏ యింటి కెడుతుందో అన్న ఆలోచన పీకుతూనే ఉంది. వెదకబోయిన తీగె కాలికి చుట్టుకున్నట్లయింది. పదిరోజుల తర్వాత ఆనంద్ పిల్లను చూసుకోడానికి ఎప్పుడొస్తున్నాడని అడుగబోయిన నరసింహం చేతిలో రాజారావు శుభలేఖ పెట్టేటప్పటికి నరసింహం ప్రైప్రాణం పైనే పోయింది.

"ఈ రోజు పిల్లలకి మనం చెప్పవలసిందేంలేదండి! వాళ్ళ అవసరాలు వాళ్ళే చూసుకుంటారు! మనం ఊరికే పెద్దరికం నిలబెట్టుకుంటూ సరేననడమే." అని మాటల సందర్భంలో రాజారావు అన్నప్పుడు చేసేదిలేక సై అంటూ తాళంవేసేడు నరసింహం.

"ఇవన్నీ మనసులో పెట్టుకోక పెళ్లికి తప్పక రావాలి సుమా! ఎవరికెక్కడ ఘటనో అక్కడ అవుతుంది. చేరవలసిన చోటికి వాళ్ళను చేర్చడంలో మనం నిమిత్తమాత్రులం ...." అని రాజారావు అంటూంటే వెళ్లొస్తానని లేచేడు నరసింహం. రాధ కొడుకు ప్రసాదూ, రుక్మిణి కొడుకు శ్రీనివాసూ ఒక్కగానొక్క చెల్లెలు సుశీల పెళ్లి ఘనంగా జరిపించేరు. పెళ్లికి వచ్చిన నరసింహం రుక్మిణిని చూసి ఆశ్చర్యపోయాడు.

ఇక్కడకూడా తనకు రావలసినదాన్ని ఆమె రానీకుండా చేసినట్లు ఊహించుకొని మనసునిండా ఉక్రోషం పెంచుకున్నాడు.

ప్రసాదును చూడగానే సంగీతం మాస్టారు కృష్ణమూర్తి గుర్తుకొచ్చేడు.

అదే రూపం, అదే రంగు, అదే పొడవు! వేషం మార్చుకొని వచ్చినట్లుగా ఉన్నాడు.

"మీ అబ్బాయి అంతా వాళ్ళ నాన్న పోలికే!" అన్నాడు ప్రసాద్‌ను రెప్పవాల్చకుండా చూస్తూ.

రుక్మిణి గుండె గతుక్కుమంది.

ఈ లోపులో 'అమ్మా' అంటూ ఏదో పనిమీద శ్రీనివాసు అక్కడికి వచ్చేడు. నరసింహం ఆశ్చర్యంగా చూసేడు.

"నీకు ఇద్దరు కొడుకులా?" అన్నాడు రుక్మిణితో.

"లేదు. ఒక్కడే. వీడే మావాడు," అంది శ్రీనివాస్‌ను చూపించి.

"మరి వాడు..." అంటూ ప్రసాద్‌ను చూస్తూ ఉండిపోయాడు నరసింహం.

వెంటనే అతని మనసు పని చెయ్యడం మొదలుపెట్టింది. తాను బావగారిల్లు విడిచినప్పటినుంచి విన్న కథలన్నీ గుర్తుకొచ్చేయి. ఆనాడు తాను సంగీతం మాస్టారు కృష్ణమూర్తిని మేజువాణిలో కూర్చోపెట్టిన దృశ్యం గుర్తుకొచ్చింది. రాధ గుర్తుకొచ్చింది. కృష్ణమూర్తి ద్వారా రాధకు రుక్మిణి పెళ్ళి కాగానే పిల్లవాడు పుట్టేడన్న విషయం గుర్తుకొచ్చింది. ఆ తర్వాత విన్న

అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్టమైన
అముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.

అమృతాంజన్ ఆముదము

కథలూ తెలిసిన నిజాలూ ఎక్కడికక్కడ చక్కగా ఇమిడిపోయేయి.

వికృతమైన ఆలోచనలతో నరసింహం ముఖం వెలిగింది. ఆ రాత్రి ఎందుకో రుక్మిణి సరిగా నిద్రపోలేక పోయింది. రాధకి విషయం తెలీనేలేదు.

2

పోలీసు స్టేషను బయట అంతా గోలగా ఉంది. మధ్యలో ఎవరో స్త్రీ కంఠం వినబడుతూంది.

ప్రసాద్‌కి ఉద్యోగంలో చేరిన నెల రోజులకే ఈ గోలంతా అలవాటయింది. అధికారంతో దర్పంగా మాట్లాడుతూ స్టేషనుకు తెచ్చిన నేరస్థులపట్ల కాస్త నీచమైన భాష ఉపయోగించడం అక్కడ మామూలే. కాని వాళ్ళ కంఠాన్ని మించి అరుస్తూన్న స్త్రీ కంఠమే ఆశ్చర్యం కలిగించింది.

బెల్ నొక్కేడు. కానిస్టేబుల్ లోపలకు వచ్చేడు.

"ఏమిటా గోల?" అని అడిగేడు.

"బయట ఎవరో అమ్మాయి వచ్చి గోలచేస్తూంది సార్!"

"ఇటు లోపలికి తీసుకురా!" అన్నాడు.

మరు నిముషంలో ఆమె లోపలకు వచ్చింది.

ఇరవై ఏళ్ళుంటాయి. ఎరుపూ తెలుపు రంగులు మార్చి కుట్టిన బెల్ బాటమ్ తొడుక్కుంది. తేనెరంగు కూలింగ్ గ్లాసెస్. బిగించి మొదట్లో ఎర్రరిబ్బను చుట్టి గుర్రపు తోకలా వది లేసిన జుట్టుతో ఆ అమ్మాయి ఆడగుర్ర ప్పిల్లలా ఉంది. ఓ చేతిలో చిన్న లెదర్ ఫైల్ ఉంది. లోపలకు వస్తూనే గ్లాసెస్ తీసింది. కోపంతో ముఖం ఎర్రబడిఉంది. చూపులు బాణాలు వదుల్తూన్నట్లున్నాయి ప్రసాద్ ఒక్క నిముషం చూపు మరల్చు కోలేకపోయేడు.

"గుడ్ మార్నింగ్! ప్లీజ్ టేక్ యువర్ సీట్!" అన్నాడు ప్రసాద్ మర్యాదగా తనముందున్న కుర్చీ చూపించి.

ఆమె కూర్చుంది. మెల్లగా ప్రసాద్ విషయంతెలుసుకున్నాడు.అంతకు ముందు రోజు ఆ స్టేషన్‌లో ఒక పోలీసు ఆఫీసరు అవినీతికి పాల్పడిన నేరస్థు రాళ్ళున్న సెంటర్‌కు వెళ్ళి వాళ్ళతో అమర్యాదగా ప్రవర్తించేడని ఆ సెంటర్ అధికారిణి నేరారోపణ చేసింది. ఈ అమ్మాయి జర్నలిస్టు. పేరు అరుణ. ఆ ఆఫీసరు వివరాలకోసం ఇక్కడకు వచ్చింది. స్టేషను సిబ్బందితో ఘర్షణ జరిగింది.

(సశేషం)

Printed and Published by A. Chandra Sekhar Rao at 5-9-88, Public Garden Road, Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor: A. SUDHAKARA RAO